# ఆ రోజులు వేరు

**ఇచ్ఛాపురపు రామచంద్రం**

జనని జన్మభూమి స్వర్గంకంటేకూడా గొప్పవి(ట).

పుడుతూనే తల్లిని కోల్పోయిన దురదృష్టవంతుణ్ని నేను. స్కాలర్‌షిప్పూ, ఉచితంగా హాస్టలు భోజనమూ యిచ్చి నన్ను పెంచి పెద్దవాడిని చేసిన ఆంధ్ర విశ్వవిద్యాలయమే నాకు జననీ జన్మభూమీ అనిపిస్తుంది. టెక్సాస్... కాలిఫోర్నియాలలో రకరకాల ఉద్యోగాలు చేసి— ఐదేళ్ళ క్రితం న్యూయార్క్ వొచ్చి— ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాను. నన్నింతవాడిని చేసింది ఆంధ్ర విశ్వవిద్యాలయమే.

భారతదేశంలో నాకు నిజమయిన బంధువులెవరూ లేరు. ఒకే ఒక్క మిత్రుడు— విశ్వం ఉన్నాడు. ఇద్దరమూ కలసి చదువుకున్నాం. రిసెర్చి పూర్తయి— నేను అమెరికా వచ్చేసేవరకూ అతనూ నేనూ ఒకరి కొకరం ప్రాణంలా మెలిగాం. గంగిగోవు పాలు గరిటడైనను చాలన్నట్లు నిజమయిన స్నేహితుడు ఒక్కడు చాలడూ ?

న్యూయార్క్— ప్రపంచ ప్రఖ్యాతి చెందిన నగరం. నాకిక్కడ గొప్పవారితో పరిచయాలున్నాయి. అయినా— పదిహేనేళ్ళక్రిందట మసలిన నా విశ్వవిద్యాలయాన్నొక్కసారి కళ్లారాచూడాలనీ, మిత్రుడు విశ్వంతో నాలుగు రోజులు సరదాగా గడిపిరావాలనీ మనసు కొట్టుకోడం ప్రారంభించింది. అమ్మని చూడాలనీ, ఆత్మీయుడైన స్నేహితుడితో సరదాగా కాలక్షేపం చేయాలనీ ఎవరుమాత్రం ఉవ్విళ్లూరరు? మేలుకున్నా... పడుకున్నా... ఆ రోజుల జ్ఞాపకాలే.

అదృష్టవశాత్తూ— అనుకోకుండా అవకాశం లభించింది. విశ్వానికి కేబులుపంపి—విమానంఎక్కాను. అమ్మలాటి ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని చూడబోతున్న ఆనందం...స్నేహితుడు విశ్వంతో సరదాగా గడపవచ్చునన్న సంతోషం...పదిహేనేళ్ళక్రిందట మసలిన వాతావరణపు జ్ఞాపకాలు ... ఇప్పుడా పరిసరాలెలా ఉంటాయో అన్న ఆత్రత ... మనసు ఉద్విగ్నత చెందుతూ నిద్రపట్టలేదు. విమానం మేఘాలలో ఎగురుతూంటే—నా మనసు యింకా ఎత్తుల్లో ఎక్కడెక్కడో విహరించసాగింది. అనుభూతులు అమూల్యమైనవి.

ఏరోడ్రోమ్‌కి వొచ్చాడు విశ్వం. ఒకరినొకరం చూస్తూనే పోల్చుకున్నాం. నిజమయిన స్నేహాలు — పరిచయాలలా—ఎండకి మంచులా కాలానికి కరిగిపోవు. ఒక్కసారి యిద్దరమూ ఆప్యాయంగా కౌగలించుకున్నాం. అతనికళ్ళల్లోనూ ఆర్ద్రత వొచ్చిందనే నా నమ్మకం.

''అవతల— కారుంది. పద...'' నా చేయి పట్టుకు నడిపించాడు విశ్వం. ఇద్దరమూ కారులో కూర్చున్నాం. కారు—ఊరివేపు పరుగుతీస్తూంది. వాల్తేరుస్టేషన్...అల్లిపురం జంక్షన్ ... సరస్వతీ థియేటర్...

''స్లోగా పోనీ...'' నాకు బాగా తెలిసిన పరిసరాలు ప్రారంభమయ్యాయి. విశాలంగా మారిన ఆ రోడ్డు ..అటూ యిటూ కొత్తగావెలిసినకొట్లు.. పాతరోజులతో పోలికలు...చిత్రంగా ఉంది.

'కోస్టల్ బ్యాటరీ మీంచి పోదాం... సముద్ర తీరం పక్కగా...''

ఆ సముద్రం ఎంత అందంగాఉంది. అప్పుడిక్కడ యింత మంచిరోడ్డులేదు. కాని ... ''బీచ్ తగ్గిపోయిందేం?'' అడిగాను.

''సముద్రం పొంగి ఊరిమీద కురుకుతూంటే . అడ్డం వేశారు...''

రామక్రిష్ణామిషన్‌దగ్గర మలుపు తీసుకుని ఎత్తు ఎక్కసాగింది కారు.

కారు విండోలోంచి ఆత్రంగా .చిన్నపిల్లవాడిలా బయటకు చూస్తున్నాను.

పిరిపురం జంక్షన్...

''ఈ రోడ్డు బాగుంది కానీ...అప్పుడు రోడ్డు పక్క ఎర్రపూలతీగెలు దట్టంగా అల్లుకునిఉండేవి.''

విశ్వం నవ్వి ఊరుకున్నాడు. నా మనసుగ్రహించి



కాబోలు నన్ను, నా ఆలోచనలని భంగపరచడంలేదు. కారు—యూనివర్సిటీ ఏరియాలోకి వొచ్చేసరికి నేను వివశత్వమే చెందాను వివరించలేని అనుభూతి అది.

కారాగింది అతని క్వార్టర్స్ ముందు. అతని శ్రీమతి ఆహ్వానించింది, మేము దిగి యింట్లోకి అడుగుపెడుతూంటే

"అలసిపోయి ఉంటావు. వేడినీళ్ల స్నానం చేసిరా ..."

నిజమే. ప్రయాణంలో అసౌకర్యం వల్లకాదు కానీ ఆలోచనలవల్ల నిద్రపట్టలేదు ఆనందం ఎక్కువయినా మనిషికి నిద్దరరాదు కాబోలు.

స్నానం భోజనం.. ఇట్టే నిద్రపట్టేసింది—గాఢంగా తెలివొచ్చేసరికి . . గాజు కిటికీలలోంచి గదిలోకి ఎండ పడుతోంది తమాషాగా. లేచివెళ్లి కిటికీ దగ్గర నిలుచున్నాను.

అందమయిన . అద్భుతమయిన దృశ్యం.

ఆనందంతో ఆత్రతతో .. గుండెలు భారమై ...

యూనివర్సిటీ బిల్డింగులు . అవి .. హాస్టల్ బ్లాక్స్...ఆ వెనుక నీలంగా పరచుకున్న సముద్రం.. ఎంత అందమయిన పరిసరాలలో నెలకొంది ఆంధ్ర విశ్వవిద్యాలయం ! . ఇంత చక్కని బ్యాక్‌గ్రౌండ్ ఏ యూనివర్శిటీకి లభిస్తుంది? కొండమీద ... సముద్రం వొడ్డున ...

"లేచావా ! .. ముఖం కడుక్కురా. టీ తీసుకుందాం."

"నువ్వెంత అదృష్టవంతుడివి ! నీకు నా అభినందనలు" ఉద్వేగంగా అన్నాను.

"ఎందుకని ?"

"ఇద్దరమూ యిక్కడే చదువుకున్నాం నువ్విక్కడే ఉద్యోగం చేస్తున్నావు నేనేమో యీ అందమయిన పరిసరాలు వొదిలి — పరదేశం పోవలసి వచ్చింది."

"ఇదీ ఓ అదృష్టమేనా ? చక్కగా ఫారిన్‌లో ఉంటున్నారు ! అదృష్టమంటే మీది. ఇక్కడే ముంది ?" టీపాయి పట్టించుకు వొస్తున్న సురేఖ అంది. ఆమె మాటలకు తెల్లబోయాను. ఇక్కడేమీ లేదూ ?

"దూరపు కొండలు ..." అన్నాను పేలవంగా నవ్వుతూ.

# ఆ రోజులు వేరు

"ఔను. దూరపు కొండలు .. " అందామె కూడా నవ్వుతూ.

ఆమె ఉద్దేశం నా కర్థమైంది. నాకు చురక వేశాననుకుందికానీ ... అమ్మ వొడిలాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం కంటే అమెరికాలో హాయిగా ఉంటుందంటే — నేను మాత్రం అంగీకరించలేను నాగరికత మితిమీరితే సుఖాలకంటే దుఃఖాలే ఎక్కువ. అనుభవిస్తే తప్ప అంగీకరించలేరది.

"విద్యార్థిగా గడిపిన విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడు కావడం — తక్కువ అదృష్టమనుకోను" అన్నాను విశ్వం వేపు చూస్తూ.

అతను — నవ్వాడు. ఆ నవ్వులో బాధ ఉంది !

ముఖం కడుక్కుని గదిలోకి వొచ్చేసరికి — టీపాయ్‌మీద టీ పాట్, కప్పులూ వగైరాలు. ప్లేట్లలో...

సురేఖ నాకు ఆశాభంగం కలిగిస్తోంది.

"ఈ బ్రెడ్ టోస్టులు కాక — పెసరట్లో, దోసెలో చేయలేకపోయారా ? మించిపోయింది లేదుకానీ — ఇంట్లో చేగోడీలుంటే పట్రండి."

"అమెరికా నుంచి వొచ్చి చేగోడీలు తింటారా!"

నవ్వాను. "నే నమెరికానుంచి ఆంధ్రదేశం వొచ్చిందెందుకో తెలుసా ? ఆవకాయా గోంగూర పచ్చడీ తినాలనీ... ఆంధ్ర భాష వినాలనీ... ఆత్మీయులతో హాయిగా గడపాలనీ. సురేఖా ! మీరు దయచేసి నాతో తెలుగులోనే మాట్లాడండి. నేను తెలుగూ మరచిపోలేను, అమ్మలాటి ఆంధ్ర విశ్వవిద్యాలయాన్నీ మరచిపోలేను జీవితంలో. మాతృమూర్తి మాతృభాష — రెండిటి విలువా నాకు బాగానే తెలుసు"

ఆమె నిట్టూర్చింది. నన్నో వింత పశువుని చూసినట్లు చూసింది.

"డిన్నర్ — ఏం తీసుకుంటారు ?"

"రాత్రి — వంకాయ కూరా, సాంబారూ చేయండి. పెరుగూ అన్నంలో అప్పడం నంచుకుంటూంటే చాలా బాగుంటుంది." — "చూడండి. నేను డిన్నర్ తీసుకోను. హాయిగా భోజనం చేస్తాను."

ఆమె లోపలికి వెళ్లిపోయింది. ఇంకా — చాలా సాయంత్రం ఉంది.

"ఏమిటి కార్యక్రమం ?" అడిగాడు విశ్వం

"యూనివర్సిటీ ఏరియా అంతా తిరుగుదాం మనం చదువుకున్న లెక్చర్ హాల్సు .. లేబొరేటరీలు డైనింగ్‌హాలు హాస్టల్ రూమ్సు. . చూద్దాం విశ్వం ! నీకు జ్ఞాపకం ఉంది కదూ, మనం అశోకవర్ధన బ్లాక్‌లో ఇరవై నాలుగు గదిలో ఉండేవాళ్లం. ఓసారా గది చూడాలి. ఆ గదిలో — గోడమీద — మేకుతో — మన యిద్దరి పేర్లూ చెక్కేశాం గుర్తుందా ?"

అతని ముఖం ఎందుకో ఒక్కసారి వివర్ణమైంది "వొద్దు అవన్నీ చాలా మారిపోయాయి."

"అందుకే. మారిన రూముని చూస్తుంటే గుండెలో పాత జ్ఞాపకాలు మెదులుతూ ఆ రోజులు జ్ఞాపకం వొస్తూ.. చిత్రమైన అనుభూతులు కలగవూ ?"

"ఈ విషయంలో నువ్వేమీ మారలేదు. నీ భావుకత అప్పటికీ యిప్పటికీ అలాగే ఉంది "నవ్వాడు

"చాలా విషయాల్లోనే మారలేదు " నేనూ నవ్వేశాను. "పద—" అంటూ లేచాను


"సారీ. కావాలంటే నువ్వు తిరిగిరా నిజానికి— మానేస్తేనే మంచిది."


"ఏమిటి నీ భయం? మరచిపోకు.మనమిప్పుడు ప్రొఫెసర్లం. అప్పటిలా స్టూడెంట్సు కాము " పెద్దరికాన్ని గుర్తుచేశాను నవ్వుతూనే.

"అందుకే " అన్నాడు. నాకేమీ అర్థంకాలేదతని వైఖరి ఒకటి మాత్రం స్పష్టమైంది అతనికి నాతో అలా రావడం యిష్టంలేదెందుకో ఇంక అతన్ని ఒత్తిడిచెయ్యలేదు.ఒంటరిగానేబయలుదేరాను

ఈ పదిహేనేళ్లలోనూ ఎంతో మారిపోయింది యూనివర్సిటీ. కొత్త బిల్డింగులు ఎన్నెన్నో లెక్చర్ హాల్సు. . లేబొరేటరీలు అనేకమైన బ్లాక్స్ . ఒక్కొక్కటీ చూసుకుంటూ వెళ్తున్నాను. స్టూడెంట్లు నన్ను వింతగా చూస్తున్నారు నేనువారిని పట్టించుకోకుండా నా ధ్యాసలో ఉండిపోయాను పాత బిల్డింగులకీ కొత్తవాటికీ ఎక్కడా పోలికలు దొరకడంలేదు. ఎంత మార్పు వొచ్చేసింది! గదులు మూసివున్నా— పైనుంచే వాటిని చూస్తూ కారిడార్స్‌లో నడుస్తున్నాను.

నేను చదువు నేర్చుకున్న లెక్చర్ హాల్స్ ఏవి ? గుర్తించలేకపోతున్నానంటే సిగ్గే వేస్తుంది






## ఆ రోజులు వేరు

ఐనా— ఆశమాత్రం చావడం లేదు. నేను పోల్చుకో లేకపోయినా— అవయినా నన్ను పోల్చుకుంటాయేమో? ఎంత మారినా— తల్లి బిడ్డను తేలిగ్గానే గుర్తు పడుతుందే.

జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ... సైన్స్ కాలేజి అంతా కలియదిరిగాను వెర్రివాడిలా. ఆ గదుల గోడలని ఆత్రంగా నిమిరాను. లాబొరేటరీల గోడలకు తల ఆన్చి ఆ స్పర్శ అనుభవించాను. నన్ను పిచ్చివాడనుకున్నా సరే. నాకవి రాతి గోడల్లా కాక అమ్మ వడిలాగే అనిపిస్తున్నాయి.

తప్పిపోయిన పిల్లవాడు తల్లిని వెదుక్కునే టట్లు— నేను కూర్చుని చదువుకున్న లెక్చర్‌హాల్స్ కోసం వెదుక్కుంటున్నాను వెర్రిగా. విశ్వవిద్యాలయ ఆవరణలోని గాలి నన్ను ఉత్తేజపరుస్తోంది. సముద్రం మీంచి వొచ్చే ఆ చల్లని గాలి—నన్ను అమ్మ లాగే చల్లగా తాకుతూంది. ఆ బిల్డింగులు...పరిస రాలు...నామట్టుకు నాకు యింట్లో తిరుగుతున్నట్లే ఉంది. చాలా పెద్ద భవనంలో — అమ్మ ఏ గదిలోఉందో అని వెదుక్కుంటున్న పసివాడిని నేను. నాది మీకు వెర్రిలా అనిపిస్తే — ఎవరి వెర్రి వారి కానందం. అంతే.

ఒక లెక్చర్‌హాలు...స్టూడెంట్స్ కూర్చునే బల్ల మీద కూర్చున్నాను. నాకళ్లు ఆర్ద్రమయ్యాయి. వింత అనుభూతి హృదయాన్ని తొణికిసలాడించి వొదిలింది. అంతలో — తాళాలు వేసేందుకు వాచ్‌మన్ వొచ్చేశాడు.

నేనూ బయటకు వొచ్చేసి — మళ్ళీ తిరగడం మొదలుపెట్టాను. విద్యార్థులు విచ్చలవిడిగా తిరుగు తున్నారు ! ప్రొఫెసర్లు మచ్చుకయినా కనిపించడం లేదు. మునుపు యిలాగకాదు. వేళదాటాక విద్యార్థులు గదులు వొదిలి బయటకు రావడానికి జంకేవారు.

జ్ఞాపకాలతో మనసు బరువుగా ఉంది. హృదయం — అనుభూతులతో నిండిపోతూంది. ఎందుకో...కళ్ళల్లోకి నీళ్లు ఊరుతున్నాయి ఎంత తుడుచుకుంటున్నా. అలాగే అన్నీ చూసుకుంటూ... పరధ్యానంగా నడుస్తూ...

త్రుళ్లి పడ్డాను. చిలిపికెరటం నామీద నీరు జల్లిపోయింది. అరె ! నేను సముద్రపువొడ్డుకి వొచ్చే శానా ? ఏనాటి అలవాటు! అప్పుడూ యింతే. విశ్వం, నేనూ కబుర్లలోనో, చర్చలలోనోపడి — మాకు తెలియకుండానే సముద్రతీరానికి చేరుకునేవాళ్ళం. ఈ ప్రదేశంతో నాకున్న అనుబంధం ... అనాటి అనుబంధం ... ఎంత చిత్రంగా పునరావృతమైంది!

అమెరికా బీచ్‌లలోనూ ... నయాగరా జలపాతం దగ్గరా— నా కెప్పుడూ యిక్కడ లభించి నంత హాయి లభించనేలేదు నిజంగా !

మళ్లీ ... ఆ రోజులు ... జ్ఞాపకాలు ...

మనసు ఎక్కడో తేలిపోతూంది.

ఒక్కసారి త్రుళ్లి పడ్డాను. గిటార్ ధ్వని అటుచూశాను.

వెన్నెలలో ... వెన్నెలెప్పుడు వొచ్చేసింది చెప్పా పెట్టకుండా ?

వెన్నెలలో...చిన్నగుంపు. సంగీతమూ,నృత్యమూ. వాళ్లు దాదాపు దిగంబరంగా ఉన్నారు. పిచ్చిగా గెంతుతున్నారు. వెర్రిగా అరుస్తున్నారు. జాయింట్లు

పేలుస్తున్నారు. సీసాలు తాగుతూ ... నాట్యాలు చేస్తున్నారు. హిప్పీ క్యాంప్ !? వీళ్ళ యూనివర్సిటీ స్టూడెంట్సుకారుకద ? ఉహూఁ ... కారేమో ... అహ ... ఔనేమో. వొద్దు ... కాకూడదు.

అక్కడ ఉఁడబుద్ధికాలేదిక. భయపడినవాడిలా త్వరత్వరగా పరుగులాగ నడవసాగాను, భరించలేని దృశ్యం తరుముకొస్తున్నట్లు.

హాస్టల్స్ !

చాలా గదుల తలుపులు మూసి ఉన్నాయి. ప్రతి బ్లాకులోనూ కొన్నిగదుల కిటికీలలోంచే దీపాలు కనపడుతున్నాయి.

గడియారం చూసుకున్నాను. ఎనిమిది దాటుతోంది. ఆ బ్లాకు ... దానిమీద ... అశోకవర్ధన... అక్షరాలు నన్ను నిలబెట్టేశాయి.

నెమ్మదిగా నడిచాను.

ఎందుకో నా కాళ్ళు వొణుకుతున్నాయి.

రూమ్ నంబరు ఇరవై రెండు ... అప్పుడు — దీనిలో చంద్రమౌళి ఉండేవాడు. హఠాత్తుగా చచ్చిపోయాడు అపెండిసైటిస్ వొచ్చి — సకాలంలో ఆపరేషన్ జరగక. నా గుండె ఉద్వేగంతో వేగంగా కొట్టుకోసాగింది.

ఇరవైమూడు ... అడుగు పడడం అతికష్టమౌతూంది. శరీరం చెమటలు పోస్తూంది. హృదయం అత్యంత భారం ఐపోతూంది.

ఇరవైనాలుగు ... ఎలాగో చేరాను తలుపు దగ్గరికి. చేతులు వొణుకుతున్నాయి. అప్పుడు నేనుండే గది. వార్డెన్ని బతిమాలుకుని— యీ గదిలోనే ఉన్నాను యూనివర్సిటీ చదువంతా అయ్యే వరకూ. ఇప్పుడీ గది ఎలా ఉందో ?

తలుపు తోసేదా ? ఎవరు నువ్వంటే ? సారీ చెప్పాలా ? లేక ... ఒకప్పుడు పదిహేనేళ్ళ క్రిందట యీ గదిలో ఉండేవాడిని. ఆ మమకారంతో ... చూడ్డానికి వొచ్చేనని చెప్పేదా ? నవ్వుతారేమో — గదులతో మమతలేమిటని ?

ఎప్పుడు తలుపు తోశానో ? చటుక్కున తెరచుకుంది. ఎదురుగా కనిపించిన దృశ్యం...నన్ను నిర్విణ్ణుణ్ణి, నిర్వీర్యుణ్ణిచేసి వొదిలింది. నా గొంతు తడారిపోయింది. నిలువెల్లా వొణికిపోసాగాను. నాకేమిటో ఐపోతూంది. భరించలేకపోతున్నాను.

ఆ గదిలో ...

ఒక మూల నలుగురు పేకాడుకుంటున్నారు. మరోమూల ముగ్గురు కూర్చుని తాగుతున్నారు. నలుగురైదుగురు ఊరికే కూర్చున్నారు. ఆ గది గోడలనిండా అసభ్యకరమైన అర్ధనగ్న . సంపూర్ణ నగ్న చిత్రాలు... అక్కడక్కడ సినీతారల క్యాలెండర్లు. గదినిండా సిగరెట్ పొగ. వాళ్ళ తమ కార్యక్రమంలో ఎంత నిమగ్నం ఐపోయారంటే— నేను తలుపు తెరిచిన సంగతే పట్టించుకోలేదు !

గదిలోకి అడుగు పెట్టబుద్ధి కాలేదు. ఎలాగో వెనక్కి వచ్చేశాను. ఏమిటిది ? వీళ్ళ స్టూడెంట్స్లేనా ? వీరు నేర్చుకుంటున్న విద్య యిదేనా ? ప్రొఫెసర్లేంచెబుతున్నారు ? హాస్టల్ వార్డెనేంచేస్తున్నారు? హాస్టల్లోనే యింత విచ్చలవిడితనమా ?

ఇంటి వేపు నడుస్తున్నాను.

ఎవరో స్టూడెంట్లు— తన అభిమాన నటుడు గొప్పవాడంటే తన అభిమాన నటుడు గొప్పవాడని పోట్లాడుకుంటూ ... కొట్టుకోడానికి సిద్ధంగా ఉన్నారు !

జాలివేసింది వాళ్ల మీద.

మనసు వికలమైపోయింది. విశ్వం నాతో ఎందుకు రానన్నాడో తెలిసింది. ఇల్లు చేరుకున్నాను.

చన్నీళ్లతో తల స్నానం చేశాను. పరిస్థితి కొంచెం మెరుగైనట్లనిపించింది. సురేఖ భోజనానికి పిలిచింది. విశ్వమూ నేనూ కూర్చున్నాం, భోజనాలు పూర్తిచేసి. అతనడిగాడు. ''ఎలా అయింది నీ షికారు ?''

నేను మాట్లాడలేదు. ఓటమి నంగీకరించడం— చాలా కష్టం. మెల్లగా అన్నాను. ''సినిమాకి వెళ్దాం. తెలుగు సినిమాకి ...''

''అలాగే.''

''మీ శ్రీమతి ...''

''ఆమె రాదు. తెలుగు సినిమాలంటే తలనొప్పి ఆమెకు. టి. వి. చాలు.''

కాగల కార్యం గంధర్వులు తీర్చడమంటే యిదేనేమో. నేను కోరుకున్నది— విశ్వమూ నేనే వెళ్లాలని ఎందుకంటే...

చదువుకునే రోజుల్లో మా యిద్దరికీ సినిమాల పిచ్చి ఎక్కువగా ఉండేది. ఎంత బాగా చదివే వాళ్లమో అంత తరచుగా సినిమాలూ చూసేవాళ్లం. కాని... దొంగతనంగా చూడవలసివచ్చేది. ప్రొఫెసర్ల కంటపడితే రాంక్ దెబ్బతింటుందని భయం. సత్ప్రవర్తన లేనివారికి విద్యని ప్రసాదిస్తే అపాత్రదాన మౌతుందని వారి భయమేమో. అందుకే — ఎంత బాగా చదువుతున్నా వొదిగి వొదిగి ఉండే వాళ్లం. వార్డెన్కి తెలియకూడదని సెకండ్ షోలు చూసేవాళ్లం - అటూ యిటూ సుమారు ఐదారు మైళ్ల నడకకి సిద్ధపడి. అప్పుడు — చీకటి పడ్డాక సిటీబస్సు లుండేవికావు మరి. ఆ రోజుల్లో — సెకండ్ షోలకి రౌడీలూ పనికిమాలినవాళ్లూ మాత్రమే వొస్తారనీ, పెద్దమనుషులూ ప్రొఫెసర్లూ... గౌరవనీయులూ రారనీ ప్రజాభిప్రాయం. ఐనా — ప్రొఫెసరెవరూ లేరని నిర్ధారణ చేసుకుంటే తప్ప హాలులోకి అడుగు పెట్టేవాళ్లం కాము. జీవితంలో ఎప్పుడయినా నిర్భయంగా సినిమా చూడగలమా అనిపించేది. ఆనాటి తీరని కోరిక తీర్చుకుందుకే విశ్వాన్ని సినిమాకి బయలుదేరదీశాను

థియేటరు ముందు ఆగింది కారు. ఇద్దరమూ వెయిటింగ్ హాలులోకి నడిచాం. అమెరికన్ థియేటర్లతో పోల్చకపోతే — యిది చక్కగానే ఉంది. కాని... ప్రతి కౌంటరూ రష్గానే ఉంది... డ్రెస్ సర్కిల్స్తోసహా. విశ్వం ఆగి — కౌంటర్లవేపు చూడసాగాడు.

''జ్ఞాపకముందా? అప్పుడు మనం.. ప్రొఫెసరు లేకుండా చూసుకుని తప్ప సినిమాహాలులో అడుగు పెట్టేవాళ్లం కాము.'' నవ్వాను.

''ప్రొఫెసరంటే సింహస్వప్నమే.''

''ఔను కానీ...పద... మరో పిక్చర్కి పోదాం.''

''అదేం ?'' తెల్లబోయి చూశాను.

''ఈ సినిమాకి స్టూడెంట్లు వొచ్చారెక్కువగా.''

''ఐతే ? మనం... నువ్వు ప్రొఫెసర్వి కదా?'' ఆశ్చర్యంగా అడిగాను.

''అందుకే.'' అంటూ నన్ను కారు దగ్గరకి నడిపించసాగాడు.

''నాకేమీ అర్థం కావడంలేదు. స్పష్టంగా చెప్పు.'' అన్నాను కారులో కూర్చున్నాక.

''ఆ రోజులు వేరు. అప్పుడు స్టూడెంట్లు ప్రొఫెసర్లకి భయపడేవారు. కాలం మారిపోయింది. ఇప్పుడు—ప్రొఫెసర్లే స్టూడెంట్లకి భయపడాలి. అదీ రూలాఫ్ ద డే. అమెరికావాడివి, నీ కర్థం కాదులే.''

కారు పరుగెడుతూంది.

జ్ఞాపకాలను జ్ఞాపకాలుగా మిగుల్చుకుంటేనే అవి తీయగా ఉంటాయి. కాలగతి అనే గీటురాయి మీద స్మృతులను పరీక్షించబోతే — పరిణామాలిలాగే ఉంటాయేమో! ఎందుకంటే...కాలం మారుతూంది. నిరంతరం మారుతుంది. మార్పు—కాలం తీర్పు.

అమెరికా నుంచి ఆంధ్రదేశం రావడం — పొరపాటు చేశానేమో అనిపించిందొక్కసారి. ●

